సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం ⋮ 11 ⋮ జనవరి ⋮ 2024



జిల్లా కథ కంచికేనా ?!

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రంగా మారిన నత్తపల్లి జిల్లా అంశం మళ్లీ మొదటి కొచ్చినట్లే కనిపిస్తోంది. 8లో



సమష్టి కృషితో లక్ష్యసాధన

సమష్టి కృషితో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు కృషి చేయాలని సింగరేణి సీఎండీ బలరామ్ సూచించారు. 10లో

గరిష్ఠం/కనిష్ఠం 31°/19°

వాతావరణం

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో బుధవారం స్వామివారికి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వైభవంగా రుద్రహోమం



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో ఘనంగా రుద్రహోమం పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం యాగశాలలో రుద్ర హోమం జరిపారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాల నడుమ స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. మండపారాధన, గణపతి పూజలు గావించారు. చివరకు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజలో పాల్గొన్న దంపతులకు అర్చకులు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన బేతంపూడి ఉర్సు ఉత్సవాలు




బేతంపూడి దర్గాలో ప్రార్థన చేస్తున్న భక్తులు

టేకులపల్లి: ఈ నెల 8న ప్రారంభమైన బేతంపూడిలోని హజరత్ సయ్యద్ జమాలుద్దీన్ బిహారీ బాబా దర్గా ఉర్సు వేడుకలు మూడో రోజు బుధవారం ముగిశాయి. కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొన్నారు. చివరి రోజు దీపారాధన, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రమణారెడ్డి, దర్గా కమిటీ బాధ్యులు షేక్ షఫీ, షేక్ జానీ, ఖాజా మొయినుద్దీన్, షకీల్, హాసీమ్, నదీమ్, అమీర్, మధుస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ పర్సన్ ఇన్‌చార్జ్‌గా మధుసూదన్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా గ్రంథలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టరు. ఇక నుంచి గ్రంథాలయాల వ్యవహారాలను పర్సన్ ఇన్‌చార్జే పర్యవేక్షించనున్నారు.

గణతంత్ర వేడుకలపై జీఎం సమీక్ష



మాట్లాడుతున్న జీఎం బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని ప్రకాశం స్టేడియంలో ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర వేడుకలపై బుధవారం జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి కార్మికులు, పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. విద్యార్థులు కవాతు, మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. అధికారులు కె.శ్రీనివాసరావు, రాజశేఖర్, వేణుమాధవ్, నాగరాజు, రామశేషయ్య, సత్యనారాయణ, రవికుమార్ పాల్గొన్నారు.

పర్యవేక్షణ లేకనే..!



క్రీడా పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వెనుకంజ

- సత్తా చాటని భద్రాచలం ఐటీడీఏ పరిధి విద్యార్థులు
- రెండు క్రీడా పాఠశాలలు ఉన్నా కానరాని ఫలితం
- పూర్తిస్థాయిలో, రెగ్యులర్ కోచ్‌లను నియమించని వైనం
- ఉన్నతాధికారులు దృష్టి పెడితే మేలు

పాల్వంచరూరల్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యార్థులు క్రీడా పోటీల్లో ఆశించిన ఫలితాలు సాధించలేదు. గతంలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులు ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో రెండో స్థానానికే పరిమితమయ్యారు. ఉచితంగా విద్యనందించడంతోపాటు క్రీడల్లో గిరిజన విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఏళ్ల క్రితం ఐటీడీఏ క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేసింది. అప్పటివరకు ఆశ్రమ పాఠశాలలుగా ఉన్న పాల్వంచ మండలం కిన్నెరసాని బాలుర, గుండాల మండలం కాచనపల్లి బాలికల పాఠశాలలను క్రీడా పాఠశాలలుగా మార్చింది. 2017, 2018 నుంచి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించారు. ప్రత్యేకంగా కోచ్‌లు, మెనూ అమలు చేస్తూ గిరిపుత్రుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించాలని నిర్ణయించారు. కాగా భద్రాచలం ఐటీడీఏ పరిధిలో భద్రాద్రి, ఖమ్మం జిల్లాలు ఉన్నాయి.

రెండో స్థానానికి హ్యాట్రిక్ చాంపియన్..

రాష్ట్రంలోని ఐటీడీఏల పరిధిలో ఇప్పటివరకు నాలుగుసార్లు క్రీడా పోటీలు నిర్వహించారు. వరుసగా మూడుసార్లు భద్రాచలం ఐటీడీఏ విద్యార్థులే ఉత్తమ ప్రతిభ చూపారు. చాంపియన్‌గా నిలిచారు. నాలుగో రాష్ట్రస్థాయి క్రీడలు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు పాల్వంచ మండలం కిన్నెరసానిలో నిర్వహించారు. ఈ పోటీల్లో భద్రాచలం ఐటీడీఏ విద్యార్థులు ఆశించిన ప్రతిభ చూపలేకపోయారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు ఐటీడీఏ విద్యార్థులు చాపింయన్‌షిప్ కైవసం చేసుకున్నారు. మన విద్యార్థులు రెండోస్థానంలో నిలిచారు. హ్యాట్రిక్ చాంపియన్‌గా నిలిచిన విద్యార్థులు.. ఈసారి రెండోస్థానంతో ఎందుకు సరిపెట్టుకోవాల్సి వచ్చిందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

పది రోజులే శిక్షణ

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల షెడ్యూల్ ప్రకటించాక వివిధ ఐటీడీఏల పరిధిలో సుమారు నెలరోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లాలో మాత్రం పదిరోజుల ముందు నుంచే కోచ్‌లు శిక్షణ ప్రారంభించారు. ఉట్నూర్ ఐటీడీఏ విద్యార్థులు నెల రోజుల శిక్షణ పొందడంతోనే ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచారు. భద్రాచలం ఐటీడీఏ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ శిక్షణ ఆలస్యంగా ప్రారంభమైందని పలువురు పేర్కొంటున్నారు.

ఐటీడీఏ పీఓ ఆరా?

క్రీడలు ఆడే విద్యార్థులకు ఐటీడీఏ ప్రత్యేక మెనూ అమలు చేస్తోంది. సాధారణంగా ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.50 లోపు చార్జీలు చెల్లిస్తుండగా, క్రీడాకారులైన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.80 చొప్పున చెల్లిస్తోంది. రోజూ పాలు, చికెన్, మటన్ వంటి పౌష్టికాహారం కూడా అందిస్తోంది. కోచ్‌లను నియమించడంతోపాటు ప్రత్యేక మెనూ అమలు చేస్తున్నా విద్యార్థులు క్రీడల్లో ఎందుకు వెనుకబడ్డారనే విషయమై భద్రాచలం ఐటీడీఏ పీఓ ఆరా తీస్తున్నట్లు సమాచారం. నేడో, రేపో సమీక్ష సమావేశం నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా సమర్థులైన రెగ్యులర్ కోచ్‌లను నియమించడంతోపాటు పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తేనే విద్యార్థులు రాణిస్తారని పలువురు పేర్కొంటున్నారు. అవకతవకలు లేకుండా క్రీడాధికారులను ఎంపిక చేయాలని కోరుతున్నారు.

కోచ్‌ల కొరత

ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో, క్రీడా పాఠశాలల్లో రెగ్యులర్ కోచ్‌లు లేరు. కాంట్రాక్ట్ కోచ్‌లను నియమించి శిక్షణ నెట్టుకొస్తున్నారు. కొందరు కాంట్రాక్ట్ కోచ్‌లు మధ్యలోనే విధులు మానేస్తున్నారు. ఐటీడీఏ క్రీడా ఆఫీసర్ల ఎంపికలో కూడా లోపాలు ఉన్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సీనియర్లను విస్మరించి జూనియర్లకు అవకాశం కల్పించారనే అపవాదు లేకపోలేదు. కాచనపల్లి బాలికల క్రీడా పాఠశాలలో 200 మంది గిరిజన బాలికలు ఉండగా, ఇక్కడ వాలీబాల్, అథ్లెటిక్స్ కోచ్‌లు లేరు. దీంతో విద్యార్థినులు ఈ రెండు క్రీడల్లో వెనుకబడ్డారు. కిన్నెరసాని బాలుర క్రీడా పాఠశాలలో 200 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఆర్చరీ కోచ్ లేకపోవడంతో విద్యార్థులు విలువిద్యలో ప్రతిభ చూపలేదు.

కారణాలు సమీక్షించుకుంటాం



ఇటీవల కిన్నెరసానిలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ఐటీడీఏ విద్యార్థులు రెండోస్థానంలో నిలిచారు. గతంలో మూడుసార్లు రాష్ట్రస్థాయి చాంపియన్‌గా ప్రతిభ చాటారు. వెనుకబాటుకు గల కారణాలను సమీక్షించుకుని భవిష్యత్‌లో చాంపియన్లుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటాం.

– బి.గోపాల్‌రావు, భద్రాచలం ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్

ముమ్మరంగా పత్తి కొనుగోళ్లు



లక్ష్మీపురంలో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన పత్తి

- సీసీఐ కేంద్రాలతో రైతుకు ఒకింత ఊరట
- మార్చి నెలాఖరువరకు కొనాలని రైతుల వేడుకోలు
- బహిరంగ మార్కెట్‌లో పడిపోతున్న ధరలు

బూర్గంపాడు: జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే తక్కువ రేటుకే బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో సీసీఐ రంగంలోకి దిగి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,025 చొప్పున చెల్లిస్తుండగా, రైతులకు కొంత ఊరట కలుగుతోంది. జిల్లాలోని లక్ష్మీపురం, నెల్లిపాక, సుజాతనగర్, కారేపల్లి నాలుగు ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోళ్లు చేపట్టింది.

ఎకరానికి ఐదారు క్వింటాళ్లే..

ఈ ఏడాది జిల్లాలో 1.95 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో దిగుబడి తగ్గింది. ఎకరానికి సగటున 5, 6 క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదు. చేతికొచ్చిన పంటకు కూడా గిట్టుబాటు లేకపోవటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత నవంబర్ నుంచి రైతులు పత్తితీతలు ప్రారంభించగా, తేమశాతం ఎక్కువగా ఉండటంతో తొలివిడత పత్తిని తక్కువ ధరకే అమ్ముకున్నారు. క్వింటాకు రూ.6వేల వరకే చేతికందింది. రెండో విడత తీత పత్తికీ అదే పరిస్థితి ఎదురైంది. డిసెంబర్ మొదటి వారంలో తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో చేలలో పూసిన పత్తి వర్షానికి తడిసింది. తేమశాతం ఎక్కువై, కొంత రంగు మారడంతో ప్రైవేటు వ్యాపారులు కొనుగోలుకు ముందుకు రాలేదు. దీంతో సీసీఐని ఆశ్రయించగా, అక్కడ కూడా తేమశాతం 8 మాత్రమే ఉండాలనే నిబంధన విధించడంతో రైతులకు ఇబ్బందులు తప్పలేదు. అయితే మార్కెటింగ్‌శాఖ, వ్యవసాయ శాఖ అధికారులను సీసీఐ బయ్యర్లు సమన్వయం చేసుకుంటూ కొనుగోళ్లను ముమ్మరం చేశారు. వ్యవసాయశాఖ క్రాప్ బుకింగ్ ఆధారంగా పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్న రైతుల నుంచే కొంటున్నారు. పత్తి విక్రయానికి వచ్చిన రైతు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఫొటో తీస్తున్నారు. ఆధార్ లింకైన సెల్‌నంబర్‌కు ఓటీపీ వచ్చాకే కొనుగోళ్లు చేపడుతున్నారు. అనంతరం వారం, పదిరోజుల వ్యవధిలో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తున్నారు. ఎక్కడ కూడా దళారుల ప్రమేయం లేకుండా సీసీఐ కొనుగోళ్లు సాగుతున్నాయి.

18,205 మెట్రిక్ టన్నుల కొనుగోలు..

ఇప్పటివరకు జిల్లాలో సీసీఐ 18,205 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసింది. ప్రైవేటు వ్యాపారులు కేవలం 832 మెట్రిక్ టన్నులే కొన్నారని అధికారులు చెబుతున్నారు. తీసిన పత్తిలో 90శాతం మేర కొన్నట్లు సీసీఐ ద్వారా కొన్నట్లు పేర్కొంటున్నారు. మరో రెండున్నర నెలలపాటు సీసీఐ కొనుగోలు చేస్తేనే రైతుకు మద్దతు ధర దక్కుతుంది. మార్చి నెలాఖరు వరకు సీసీఐ కొనుగోళ్లు కొనసాగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మద్దతు ధర కల్పిస్తున్నాం



ఈ ఏడాది బహిరంగ మార్కెట్‌లో పత్తి రేటు కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉంది. దీంతో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించింది. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొంటున్నాం. మద్దతు ధర చెల్లిస్తున్నాం. రైతులు పత్తిలో తేమశాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలి.

-సంజీవరావు, సీసీఐ బయ్యర్

రైతులకు ఒకింత ఊరట



సీసీఐ ఆధ్వర్యంలో నాలుగు చోట్ల పత్తి కొనుగోళ్లు జరిపిస్తున్నాం. బహిరంగ మార్కెట్‌లో ధర తక్కువగా ఉండగా, ప్రభుత్వ మద్దతు ధరకు కొంటున్నాం. మార్కెటింగ్, వ్యవసాయశాఖల సమన్వయంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం.

-అలీమ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

సకాలంలో టీడీఎస్ దాఖలు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డాక్టర్ రాంబాబు

కొత్తగూడెంఅర్బన్: టీడీఎస్ నిర్దేశిత సమయంలో దాఖలు చేయాలని, లేకపోతే అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుందని అదనపు కలెక్టర్ డాక్టర్ పర్సా రాంబాబు తెలిపారు. బుధవారం ఐడీఓసీలో ఆదాయపు పన్నుశాఖ ఆధ్వర్యంలో ఆదాయ, వ్యయ వివరాల నివేదికలు రూపకల్పన, టీడీఎస్, టీసీఎస్ మినహాయింపు తదితర ఆదాయపు పన్ను చట్టాలపై అన్ని శాఖల జిల్లా అధికారులకు నిర్వహించిన అవగహనా కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ సిబ్బంది ఆదాయ, వ్యయ నివేదికలు సకాలంలో సమర్పించాలని సూచించారు. పన్ను మినహాయింపు అనంతరం మూడు నెలలకోసారి టీడీఎస్ చేయించాలన్నారు. సిబ్బంది తీసుకుంటున్న వేతనాన్ని బట్టి టీడీఎస్ చేయాల్సిన బాధ్యత డ్రాయింగ్ ఆఫీసర్లదేనని స్పష్టం చేశారు. టీడీఎస్ దాఖలు చేయకపోతే ఆయా శాఖల జిల్లా అధికారులను చేసి నోటీసులు జారీ చేస్తామన్నారు. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం కాంట్రాక్టర్లకు చెల్లింపు చేసిన నిధుల విషయంలో పాన్‌కార్డుకు ఆధార్ అనుసంధానమై ఉంటే 2శాతం, లేకపోతే 20 శాతం టీడీఎస్ చెల్లించాలన్నారు. అనంతరం ఆదాయపు పన్ను చెల్లింపు ప్రక్రియపై ఆదాయ పన్ను శాఖ కమిషనర్ పన్నులు, మినహాయింపు, టీడీఎస్, ఈ–ఫైలింగ్ ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో డీఆర్వో రవీంద్రనాథ్, ఆదాయపు పన్ను శాఖ టీడీఎస్ పర్యవేక్షణ అధికారులు సునీల్‌కుమార్‌మిశ్రా, వై.మాధవి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు

అశ్వారావుపేటరూరల్: త్వరలో జరిగే ఎంఎల్‌సీ(పట్టభద్రుల నియోజకవర్గం) ఎన్నికలకు పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్, అశ్వారావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబు సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న పట్టభద్రులు వచ్చే నెల 6వ తేదీలోపు దరఖాస్తును ఫారం–18లో నివాస ధ్రువీకరణతోపాటు డిగ్రీ ఉత్తీర్ణతకు సంబంధించిన మెమో లేదా ప్రొవిజనల్, ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, తహసీల్దార్ కార్యాలయంలో కూడా దరఖాస్తులు అందించవచ్చని వివరించారు. గతంలో ఓటరుగా నమోదైనవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎన్నికల డీటీ సీహెచ్ రామకృష్ణ, సిబ్బంది జి.ప్రభాకర్, వి. లావణ్య, రాజకీయ పార్టీల నాయకులు చిన్నంశెట్టి సత్యనారాయణ, రామకృష్ణ, టి.జగన్నాధం, చిప్పనపల్లి శ్రీనివాసరావు, గంధం ఆనంద్, ఎస్. రాకేష్ పాల్గొన్నారు.

17న ఇంటర్వ్యూలు

పాల్వంచరూరల్: సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి ఈ నెల 17న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయనశాస్త్రం, ఇంగ్లిష్ అధ్యాపకుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. పీజీలో 55శాతం మార్కులు, నెట్, సెట్ అర్హత ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

పాఠ్య పుస్తకాల కేంద్రం తరలింపు

కొత్తగూడెంఅర్బన్: ఆరేళ్లుగా జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు జెడ్పీహెచ్‌ఎస్‌లో కొనసాగిస్తున్న ప్రభుత్వ పాఠ్యపుస్తకాల కేంద్రాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని ఆనందఖని జెడ్పీహెచ్‌ఎస్‌కు మార్చారు. కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి ప్రారంభించి మాట్లాడారు. పాఠ్య పుస్తకాల సరఫరా కేంద్రం మార్పుతో జిల్లాలోని అన్ని మండలాలకు త్వరితగతిన పాఠ్యపుస్తకాలు చేరవయవచ్చని తెలిపారు. జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ ఎన్.సతీష్‌కుమార్, గోదాం ఇన్‌చార్జ్ ఎస్‌డి.రవిప్రతాప్, హెచ్‌ఎం జి.లక్ష్మి పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

రా.. రమ్మంటున్న మార్కెట్లు!

- నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రభుత్వం దృష్టి
- ఉమ్మడి జిల్లాలో 14 వ్యవసాయ మార్కెట్లు
- ప్రస్తుతం పాలకవర్గాలు ఉన్న నాలుగు కమిటీలూ రద్దు
- కొత్త కమిటీల్లో చోటు కోసం ఆశావహుల యత్నాలు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీకి అడుగులు వేస్తోంది. అధికారంలోకి వచ్చిన నెల వ్యవధిలోనే పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపునిచ్చే పని మొదలుపెట్టింది. తొలుత వ్యవసాయ మార్కెట్ కమిటీలను భర్తీ చేయాలని నిర్ణయించగా.. ఇప్పుడు ఉన్న అన్ని కమిటీలను రద్దు చేసింది. అలాగే, కొత్త కమిటీల నియామక బాధ్యతను ఎమ్మెల్యేలకు అప్పగించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 14 వ్యవసాయ మార్కెట్లు ఉండగా.. వీటిలో ప్రస్తుతం నాలుగు మార్కెట్లకు మాత్రమే కమిటీలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయంతో ఈ కమిటీలు రద్దయ్యాయి. ఇక మిగిలిన పది మార్కెట్లకు పర్సన్ ఇన్‌చార్జిలుగా మార్కెటింగ్ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు.

రిజర్వేషన్ల ఆధారంగా..

తెలంగాణ ఏర్పడ్డాక 2016లో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్లకు రిజర్వేషన్ ప్రాతిపదికన కమిటీల నియామకం చేపట్టింది. ఈ క్రమంలో వివిధ వర్గాలకు చైర్మన్లుగా స్థానం దక్కింది. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మద్దులపల్లి, నేలకొండపల్లి, మధిర, వైరా, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరుతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, దమ్మపేట, భద్రాచలం, చర్ల వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి.

నాలుగింటికే కమిటీలు

ఖమ్మం జిల్లాలోని ఎనిమిది వ్యవసాయ మార్కెట్లలో ఖమ్మం, వైరా, మధిర, నేలకొండపల్లి మార్కెట్లకు పాలకవర్గాలు ఉన్నాయి. మద్దులపల్లి, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు వ్యవసాయ మార్కెట్లకు కమిటీల నియామకం జరగలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మార్కెట్లకు 1/70 యాక్ట్, ఏజెన్సీ ప్రాంతం కావడంతో పాలకవర్గాలు లేవు. అయితే గతంలో కొన్నిచోట్ల పాలకవర్గాలు పనిచేశాయి. ఆ తర్వాత ఆటంకాల కారణంగా నియామకాలు నిలిచిపోయాయి. కాగా, ఖమ్మంలోని నాలుగు మార్కెట్లకు కూడా కొద్దినెలల క్రితమే కమిటీలను నియమించారు. రాష్ట్రంలో రెండో పెద్ద మార్కెట్ అయిన ఖమ్మం మార్కెట్ చైర్‌పర్సన్‌గా కార్పొరేటర్ దోరేపల్లి శ్వేతను గత ఏడాది జనవరి 18న ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల కాలపరిమితిగా నిర్ణయించడంతో 2025 జనవరి 18 వరకు గడువు ఉంది. నేలకొండపల్లి మార్కెట్ చైర్‌పర్సన్‌గా నంబూరి శాంత ఓసీ మహిళా కేటగిరీలో 2022 సెప్టెంబర్ 13న ప్రమాణం చేశారు. వైరా మార్కెట్ చైర్మన్‌గా పసుపులేటి మోహన్‌రావును గత ఏడాది సెప్టెంబర్ 20న, మధిర మార్కెట్ చైర్మన్‌గా బాదం శ్రీనివాసరావును గత ఏడాది జూన్ 5న నియమించారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరంతా పదవులు కోల్పోనున్నారు.

ఇన్‌చార్జిల పాలనలో..

ఉమ్మడి జిల్లాలోని పది మార్కెట్లకు మార్కెటింగ్ శాఖ అధికారులు పర్సన్ ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఇందులో సత్తుపల్లి మార్కెట్ కమిటీ ఐదేళ్ల నుంచి భర్తీకి నోచుకోలేదు. ఈ కమిటీ ఎస్సీ జనరల్‌కు రిజర్వు కాగా, ఎస్టీకి రిజర్వ్ అయిన ఏన్కూరు కమిటీ రెండున్నరేళ్లుగా ఖాళీగా ఉంది. కల్లూరు, ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి మార్కెట్ల పదవీకాలం ఏడాది క్రితం ముగిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆరు మార్కెట్‌లకు అసలు పాలకవర్గాలే లేవు. అయితే, ఉన్న కమిటీలను రద్దు చేసిన ప్రభుత్వం భద్రాద్రి జిల్లాలోని మార్కెట్లకు సైతం పాలకవర్గాలను నియమిస్తుందా, లేదా అన్నది తేలాల్సి ఉంది.

ఆశావహుల్లో జోష్

వ్యవసాయ మార్కెట్లకు కమిటీల నియమించనున్నట్లు సీఎం ప్రకటించగా... కొత్త నియామకాల బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలకు కట్టబెట్టారు. దీంతో పదవులు దక్కించుకునేందుకు కాంగ్రెస్‌లోని ఆశావహులు ప్రయత్నాలను ప్రారంభించారు. ముఖ్యమంత్రి నిర్ణయం వెలువడగానే పలువురు నేతలు రాజధాని బాట పట్టారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించిన నేపథ్యాన ఆశావహులు ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన నెల వ్యవధిలోనే నామినేటెడ్ పదవుల భర్తీకి శ్రీకారం చుట్టడంతో ఇతర నామినేటెడ్ పదవులపై కన్నేసిన నేతలు సైతం మార్కెట్ పోస్టుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

19, 20 తేదీల్లో కవితా కార్యశాల

కొత్తగూడెంటౌన్: పిల్లల్లో రచనా శక్తిని పెంపొందించేందుకు ఈ నెల 19, 20వ తేదీల్లో కవితా కార్యశాల పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ్ చిల్డ్రన్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో రెండు రోజులపాటు ఈ పోటీలు ఉంటాయని, 8,9,10 తరగతుల విద్యార్థులు పోటీలకు అర్హులని వివరించారు.

రేపటి నుంచి 'యూసుఫ్' క్రికెట్ టోర్నీ

బూర్గంపాడు: ఈ నెల 12వ తేదీ నుంచి బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 16వ యూసుఫ్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం బూర్గంపాడులో టోర్నమెంట్ బ్రోచర్‌ను ఎస్సై రాజ్‌కుమార్ విడుదల చేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ 15 ఏళ్లుగా నిరాటంకంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విన్నర్ జట్టుకు రూ. 30 వేలు, రన్నర్ జట్టుకు రూ.15 వేల నగదు బహుమతితోపాటు ట్రోఫీని అందిస్తామని పేర్కొన్నారు. నిర్వాహకులు ఎండీ సోహైల్‌పాషా, గొనెల సర్వేశ్వరరావు, గొనెల నాని, భజన సతీష్, బొల్లు రవికుమార్, భజన ప్రసాద్, అబ్దుల్ సలీమ్, కన్నెబోయిన సారథి, మందా ప్రసాద్, బబ్బురాయుడు, సత్తి పండు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పామాయిల్ ఫ్యాక్టరీలో వృత్తి నైపుణ్య శిక్షణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ బాలకృష్ణ

అశ్వారావుపేటరూరల్: సత్తుపల్లిలోని మదర్‌థెరిసా కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు వృత్తి నైపుణ్య శిక్షణ నిమిత్తం అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీకి బుధవారం వచ్చారు. ఈ సందర్భంగా వారికి ఫ్యాక్టరీలో ఇంజనీరింగ్, వెల్డింగ్‌తోపాటు యంత్రాల మరమ్మతులపై ఫ్యాక్టరీ మేనేజర్ ఆకుల బాలకృష్ణ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులంతా స్వయంగా ఆయా పనుల్లో ఆసక్తిగా పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించాలి

అశ్వారావుపేటరూరల్: తపాలా శాఖ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గ్రామీణ డాక్ సేవక్, తపాలా సిబ్బందికి పాల్వంచ ఎస్‌డీఐపీ రమేష్ నాయక్ సూచించారు. బుధవారం ఉప తపాలా కార్యాలయంలో 17 బ్రాంచి తపాలా కార్యాలయాల జీడీఎస్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ తపాలా కార్యాలయాల మనుగడ పొదుపు ఖాతాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. సుకన్య సమృద్ధి యోజన, మహిళా సమృద్ధి యోజన, తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా బీమా, ఐపీపీబీ వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్‌పీఎం శ్యాం మహేంద్ర, పీఏ ఉదయ్‌సాయి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి సరఫరాకు టెండర్లు

భద్రాచలంటౌన్: జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలకు కావాల్సిన ఆట వస్తువులు, క్రీడా సామగ్రిని సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 11 నుంచి 18వ తేదీలోగా కార్యాలయ పనిదినాల్లో రూ.2 వేలు చెల్లించి షెడ్యూల్ ఫారాలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం రూ.50 వేల ధరావతుతో దరఖాస్తుల సమర్పిస్తే.. ఈనెల 19న పరిశీలించి ఖరారు చేస్తామని పీఓ తెలిపారు.

రైస్ మిల్లులు, రేషన్‌షాపుల్లో తనిఖీలు



రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

బూర్గంపాడు: మండలంలోని రైస్‌మిల్లులు, పెట్రోల్ బంకులు, రేషన్‌షాపులను బుధవారం జిల్లా సివిల్ సప్లై అధికారి రుక్మిణీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. లక్ష్మీపురంలో పెట్రోల్ బంకులు, పినపాక పట్టీనగర్, ఉప్పుసాక గ్రామాల్లో రేషన్ షాపులను తనిఖీలు నిర్వహించారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కస్తాల వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

ఐటీసీ పైప్‌లైన్ పనుల అడ్డగింత



నిలిచిపోయిన పైప్‌లైన్ పనులు

బూర్గంపాడు: ఇరవెండి నుంచి ఐటీసీ పీఎస్‌పీడీకి గోదావరి నీళ్లను తీసుకెళ్లేందుకు వేస్తున్న కొత్త పైప్‌లైన్ పనులను బుధవారం రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ పైప్‌లైన్ వేసేందుకు భూములు కోల్పోతున్నవారికి ఐటీసీ పీఎస్‌పీడీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని యాజమాన్యం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ ఇప్పుడు ఐటీసీ యాజమాన్యం మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనలతో ఐటీసీ అధికారులు పనులు నిలిపివేశారు.

నేటి నుంచి రైల్వేగేట్ మూసివేత

కారేపల్లి: కారేపల్లి–ఇల్లెందు ప్రధాన మార్గంలో ఉన్న 2కేకే లెవల్ క్రాసింగ్ రైల్వే గేట్‌ను ఈ నెల 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్, రోడ్డు మరమ్మత్తుల దృష్ట్యా గేట్ మూసివేస్తున్నామని పేర్కొన్నారు. వాహనదారులు కారేపల్లి–పేరుపల్లి రోడ్డులోని 1కేకే లెవల్ క్రాసింగ్ రైల్వే గేట్ ద్వారా బీక్యా తండా, సూర్యతండా, అప్పాయిగూడెం మీదుగా వెళ్లాలని సూచించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

జిల్లా కథ కంచికేనా ?!

- ఎన్నికల ప్రచారంలో సత్తుపల్లి జిల్లా హామీ
- సత్తుపల్లి, అశ్వారావుపేట కలిపి జిల్లా చేయాలంటూ గతంలో ఉద్యమం
- తాజాగా పునర్విభజనలో శాస్త్రీయత లేదన్న సీఎం వ్యాఖ్యలతో నిరాశ
- సమీక్ష తర్వాతైనా పరిశీలించాలంటున్న స్థానికులు



సత్తుపల్లి పట్టణం వ్యూ

సత్తుపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రంగా మారిన సత్తుపల్లి జిల్లా అంశం మళ్లీ మొదటికొచ్చినట్లే కనిపిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పునర్విభజన శాస్త్రీయంగా జరగలేదని, అసెంబ్లీలో చర్చించడంతో పాటు నిపుణుల కమిటీని ఏర్పాటుచేసి పరిశీలిస్తామని ప్రకటించిన నేపథ్యాన స్థానికుల్లో చర్చ మొదలైంది. జిల్లాల పునర్విభజన అంశంపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసే అవకాశం కూడా ఉందన్న ప్రచారంతో సత్తుపల్లి జిల్లా ఏర్పాటు ఆశలు నీరుగారినట్లేనని భావిస్తున్నారు. అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాలను కలిపి జిల్లా చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని.. ప్రస్తుతం ఉన్న జిల్లాలతో పోలిస్తే ఇది విస్తీర్ణం, జనాభా విషయంలో మెరుగ్గా ఉంటుందని ఈ ప్రాంత ప్రజలు గతంలో ఉద్యమించారు. కానీ ఇప్పుడు ఉన్న జిల్లాలపైనే పునఃసమీక్షిస్తామన్న సీఎం ప్రకటనతో స్థానికుల్లో నిరాశ అలుముకుంది.

129 రోజుల పాటు దీక్షలు

జిల్లాల పునర్విభజన సమయంలో సత్తుపల్లి కేంద్రంగా కూడా జిల్లా ఏర్పాటుచేయాలని అన్నివర్గాల ప్రజలు 129 రోజుల పాటు ఆందోళనలు, దీక్షలు చేశారు. రెండుసార్లు నియోజకవర్గ బంద్ కూడా జరిగింది. సత్తుపల్లిని జిల్లా కేంద్రంగా, అశ్వారావుపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేస్తూ అదనంగా మరో కొత్తగా 10మండలాలను ఏర్పాటుచేయాలని సత్తుపల్లి జిల్లా సాధన సమితి ఆధ్వర్యాన ఉద్యమం ఉధృతంగా సాగింది. ఆ సమయాన వివిధ పార్టీల నేతలు కూడా మద్దతు తెలిపిప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ప్రకటించారు. కానీ 2018 ఎన్నికల తర్వాత ములుగు, నారాయణపేట జిల్లాలు ఏర్పాటైనా సత్తుపల్లి హామీగానే మిగిలిపోయింది.

ప్రియాంక, కేటీఆర్ హామీతో...

తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయాన సత్తుపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ, మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. నూతన ప్రభుత్వం ఏర్పడగానే ప్రక్రియ మొదలుపెట్టేలా ప్రభుత్వానికి సూచిస్తామని ప్రియాంకగాంధీ కల్లూరు సభలో ప్రకటించగా... కేటీఆర్ సత్తుపల్లి ఎన్నికల ప్రచారసభలోనూ జిల్లా అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఆతర్వాత ప్రచారంలో కూడా ఆయా పార్టీల నేతలు ఇదే అంశాన్ని పదేపదే ప్రస్తావించడంతో ఎవరు అధికారంలోకి వచ్చినా చిరకాల వాంఛ నెరవేరుతుందని సత్తుపల్లి ప్రజలు భావించారు.

కానీ ఇప్పుడు ఉన్న జిల్లాల విభజనే సరిగ్గా జరగలేదని.. దీనిపై పునఃసమీక్షిస్తామని సీఎం ప్రకటించడంతో మళ్లీ నిరాశ అలుముకుంది. అయితే, సమీక్ష అనంతరమైనా సత్తుపల్లి జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతుల కల్పనకు చేయూత

ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్‌హెడ్ సిద్ధార్థ మొహంతి



గురుకుల బాలికల పాఠశాలకు ఎల్‌ఈడీ లైట్లు అందిస్తున్న సిద్ధార్థ మొహంతి

బూర్గంపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సామాజిక బాధ్యతగా చేయూతనందిస్తున్నట్లు ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ సిద్దార్థ మొహంతి తెలిపారు. బూర్గంపాడులోని గురుకుల బాలికల పాఠశాలకు బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ లైట్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ విద్యార్థులకు విద్యాజ్యోతి పథకంలో ఉచితంగా నోట్ పుస్తకాలు, బెంచ్‌లు అందిస్తున్నామని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన కోసం ప్రథమ్ సంస్థ ఆధ్వర్యంలో ట్యూటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్ష,కార్యదర్శులు జయంత్‌కుమార్ దాస్, కేవీఎస్ గోవిందరావు, ఐటీసీ ఉన్నతాధికారులు చెంగలరావు, ప్రఫుల్ల, యాగి చంద్రశేఖర్, నాగ మల్లేశ్వరరావు, ప్రతాప్, సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ, రమేష్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కఠినంగా వ్యవహరించండి

అటవీశాఖ అధికారులకు మంత్రి సురేఖ ఆదేశం



ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్‌ఐ

ఇల్లెందురూరల్: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు యత్నించిన అటవీ సిబ్బందిపై ఇసుక మాఫియా దాడి చేయడాన్ని రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండ సురేఖ తీవ్రంగా పరిగణించారు. జరిగిన ఘటనపై ఇల్లెందు ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న నివేదిక రూపంలో ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇక ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిరోధిస్తామని ఎఫ్‌డీఓ వెంకన్న తెలిపారు.

20 మంది ట్రాక్టర్ యజమానులపై బైండోవర్ కేసులు

టేకులపల్లి: మండలంలో ఇసుక రవాణా చేస్తున్న 20 మంది ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై బుధవారం పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రమణారెడ్డి హెచ్చరించారు.

రసాభాసగా అరెస్ట్ యత్నం

- ఫారెస్టు ప్లాంటేషన్ ధ్వంసం కేసులో నిందితుల గుర్తింపు?
- అదుపులోకి తీసుకునేందుకు వచ్చిన అటవీ ఉద్యోగులు
- సీపీఎం నేతలు అడ్డుకోవడంతో తోపులాట
- ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చొరవతో వెనక్కి..



సీపీఎం కార్యాలయం వద్ద అటవీ ఉద్యోగులను అడ్డుకుంటున్న నాయకులు

కారేపల్లి: కారేపల్లి ఫారెస్టు రేంజ్ పరిధిలో ఈనెల 5వ తేదీన ఫారెస్టు ప్లాంటేషన్‌ను ధ్వంసం కేసులో ఆరుగురిని అరెస్టు చేసేందుకు అటవీ ఉద్యోగులు యత్నించగా.. సీపీఎం నాయకులు అడ్డుకోవడం, ఇతర పార్టీల నేతలు మద్దతు తెలపడంతో రసాభాసగా మారింది. రెండు వాహనాలు, ద్విచక్రవాహనాలపై సుమారు 40 మంది అటవీ ఉద్యోగులు బుధవారం కారేపల్లికి వచ్చారు. ప్లాంటేషన్ నరికివేత కేసులో నిందితులు సీపీఎం కార్యాలయంలో ఉన్నారనే సమాచారంతో అక్కడకు చేరుకుని ఎఫ్‌ఆర్‌ఓ సిద్ధార్థరెడ్డి తన సిబ్బందితో లోనకు చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. ఈక్రమంలో సీపీఎం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు భూక్యా వీరభద్రం, యర్రా శ్రీకాంత్, కొండెబోయిన నాగేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావు, కె.నరేంద్ర, వజ్జా రామారావు, దుగ్గి కృష్ణతో పాటు పోడు రైతులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. అక్కడే ఉన్న కారేపల్లి ఎస్‌ఐ పుష్పాల రామారావు ఇరుపక్షాలను సముదాయించే ప్రయత్నం చేశారు.

నిరసన, వాహనాల అడ్డగింత

సీపీఎం కార్యాలయంపై అటవీ ఉద్యోగుల దాడి గర్హనీయమని, ఎఫ్‌ఆర్‌ఓ సిద్ధార్థరెడ్డి డౌన్ డౌన్ అంటూ నాయకులు నినదించారు. అక్రమంగా అరెస్ట్ చేయాలనే యత్నాన్ని విరమించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు, పోడు రైతులకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, భద్రునాయక్, గుగులోతు భీముడు, మేదరి టోనీవీర ప్రతాప్, మల్లేల నాగేశ్వరరావు, గడ్డం వెంకటేశ్వర్లు, తొగర శ్రీను, షేక్ గౌస్ మద్దతుగా నిలిచారు. అంతేకాక కాకుండా అటవీ ఉద్యోగుల వాహనాలను అడ్డుకుని బైఠాయించారు. ఎఫ్‌ఆర్‌ఓ సిద్ధార్థరెడ్డిని సస్పెండ్ చేయాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయాన్ని నాయకులు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఎఫ్‌ఆర్‌ఓ, ఎస్‌ఐతో ఫోన్‌లో మాట్లాడడంతో అరెస్టు యత్నాన్ని విరమించుకుని వెళ్లిపోయారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ మాణిక్యారం, ఎర్రబోడు, కోయగుంపు, వడ్డెరగుంపు గ్రామాలకు చెందిన ఊటవాగు వద్ద సుమారు 60మంది రైతులు ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటుండగా, మరోచోట భూమి ఇస్తామని 200 లాక్కుని ఫారెస్టు ప్లాంటేషన్ ఏర్పాటు చేశారన్నారు. అయినా భూమి చూపించకపోగా అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు.

9హెక్టార్లలో 8,009 మొక్కలు నరికివేశారు

మాణిక్యారం, ఎర్రబోడు ఊటవాగు సమీపాన అటవీ ప్లాంటేషన్‌లోకి ఆరుగురు పోడు రైతులతో పాటు మరో 15మంది ఈనెల 5వ తేదీన రాత్రి ప్రవేశించి తొమ్మిది హెక్టార్లలోని 8,009 మొక్కలను గొడ్డళ్లతో నరికి వేశారని ఎఫ్‌ఆర్‌ఓ సిద్ధార్థరెడ్డి వెల్లడించారు. 2020వ సంవత్సరంలో సుమారు 200 ఎకరాల్లో రూ.70లక్షల వ్యయంతో ప్లాంటేషన్ ఏర్పాటుచేశామన్నారు. దీన్ని నరికేసిన కేసులో నిందితులైన భూక్యా రమేష్, జాటోతు హరికిషన్, చల్లా మల్లమ్మ, చల్లా వెంకన్న, అజ్మీరా శ్రీను, రాయల కళమ్మ గతంలో రెండు దఫాలు ఇలాగే చేయగా కేసులు నమోదయ్యాయన్నారు. కొన్ని పార్టీల నేతలు పోడుపట్టాలు వస్తాయని నమ్మబలికి రైతులను ఉసిగొల్పుతున్నారని తెలిపారు. కేసులో నిందితులను సీపీఎం నాయకులు మూడు రోజులుగా వెంట తిప్పుకుంటున్నారని పేర్కొన్నారు. డీఎఫ్ఓ ఆదేశా ల మేరకు ఆరుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అటవీ ఉద్యోగులు కవిత, మాధురి, ఆయేషా, డి.చక్రవర్తి, రవికుమార్, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు అభినందన



జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

ఇల్లెందు: గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల సహాయ అధికారిగా పని చేసిన ఇల్లెందు తహసీల్దార్ కె.రవి కుమార్‌ను కలెక్టర్ ప్రియాంక ఆల అభినందించారు. బుధవారం తన చాంబర్‌లో జ్ఞాపిక అందించారు. ఇల్లెందు నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగిన విషయం విదితమే. కాగా ఎన్నికల అధికారిగా కాశయ్య, సహాయ ఎన్నికల అధికారిగా రవికుమార్ పని చేశారు.

ఎస్పీని కలిసిన వ్యాపారులు

కొత్తగూడెంటౌన్: ఎస్పీ రోహిత్‌రాజును బుధవారం కొత్తగూడెం సూపర్‌బజార్‌లోని పెద్దబజార్, చిన్న బజార్లకు చెందిన వ్యాపారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీని చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మొరిశెట్టి భవానీప్రసాద్, తాటిపల్లి శంకర్‌బాబు, పల్లపోతు శ్రీనివాసు, గునిపాటి ఆనంద్, ఆబిద్, అనూప్ ఖండేల్వాల్, మొరిశెట్టి అనీష్‌కుమార్ తదితరులు ఉన్నారు. కాగా డీవైఎఫ్‌ఐ–2024 క్యాలెండర్‌ను ఎస్పీ ఆవిష్కరించగా, నాయకులు బాలరాజు, కాలంగి హరికృష్ణ, వీరభద్రం, నవీన్, నాగకృష్ణ, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి

దుమ్ముగూడెం : పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) సత్యనారాయణరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని నర్సాపురం, దుమ్ముగూడెం, పర్ణశాల జిల్లా ఉన్నత పాఠశాలల్లో లక్ష్య కార్యక్రమం అమలుతీరును ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, అంకితభావంతో పని చేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ప్రభాకర్ రెడ్డి, ఎంఈఓ సున్నం సమ్మయ్య, హెచ్‌ఎంలు వెంకటేశ్వరావు, ఏవీ రామారావు, ఎంఆర్‌సీ ఏఈ ప్రభాకర్ ఉన్నారు.

స్టేషన్లలో రైల్వే జీఎం తనిఖీ

కొత్తగూడెంఅర్బన్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ బుధవారం భద్రాద్రి జిల్లాలోని పలు రైల్వే స్టేషన్లలో తనిఖీలు చేపట్టారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ప్రత్యేక రైలులో వచ్చిన ఆయన మణుగూరు రైల్వే స్టేషన్, చంద్రుగొండ రైల్వేస్టేషన్లలో తనిఖీ చేశారు. అలాగే, సత్తుపల్లిలోని రైల్వే సైడింగ్, కిష్టారంలోని జీవీఆర్ సీహెచ్‌పీని సైతం జీఎం తనిఖీ చేయగా, సింగరేణి కొత్తగూడెం జీఎం ఎం.షాలేంరాజుతో పలు అంశాలపై చర్చించారు. ఆతర్వాత భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) స్టేషన్‌కు వచ్చినా కిందకు దిగకుండానే హైదరాబాద్ వెళ్లారు. జీఎంతో పాటుగా డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్, అధికారులు సురేష్‌రెడ్డి, సురేష్, చైతన్య, వాసంపాషా, దినకర ప్రణీత్, ప్రియాఅగర్వాల్, రజనీష్‌మీనా, సూర్యనారాయణ, రామకృష్ణ, కోటిరెడ్డి, నర్సింహారావు, సోమశేఖర్‌రావు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: దాడి ఘటనలో ముగ్గురు వ్యక్తులపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని జమ్మిగూడేనికి చెందిన పెన్నాడ రామకృష్ణ(దత్తుడు)కు, అదే గ్రామానికి చెందిన మరికొందరికి 14, 15/1, 16/ఇ సర్వే నంబర్లలో ఉన్న వ్యవసాయ భూమిపై కొన్నేళ్లుగా వివాదం సాగుతోంది. ఈ క్రమంలోనే ఈ నెల 5న వ్యవసాయ భూమిలోకి రామకృష్ణ వెళ్లగా, శింగులూరి బాలకృష్ణ, శింగులూరి నాగేశ్వరరావు, ఆళ్ల వెంకటేశ్వరరావు కలిసి దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆయన బుధవారం ఫిర్యాదు చేయగా, దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేధిస్తున్న బాలుడిపై..

అశ్వారావుపేటరూరల్: ప్రేమించాలని వేధిస్తున్న బాలుడిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(14)ను అదే గ్రామానికి చెందిన బాలుడు (15) కొద్ది రోజులుగా ప్రేమించాలని వేధింపులకు గురి చేస్తున్నాడు. బాలిక విషయం కుటుంబీకులకు చెప్పడంతో, ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవగాహన కలిగి ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న సీడీపీఓ తదితరులు

కొత్తగూడెంటౌన్: ప్రతీ ఒక్కరు మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన కలిగి ఉండాలని కొత్తగూడెం సీడీపీఓ స్వర్ణలత లెనినా, ప్రజ్వల సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ సూచించారు. బుధవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల సంస్థ, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. మహిళలతోపాటు పురుషులను అక్రమంగా రవాణా చేస్తూ, అవయవాలను దోపిడి చేస్తున్నారని, మహిళలను లైంగిక వ్యాపారంలోకి దింపుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాలను కల్పిస్తామంటూ ఆశ చూపి, మోసం చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం యువతులు సైబర్ ట్రాఫికింగ్ బారిపడుతున్నారని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు సమాజంలో అందరినీ అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజ్వల ఫౌండర్ సునీతకృష్ణన్, కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్, అబర్‌సింగ్, సూపర్‌వైజర్లు సీతామంగమ్మ, శారధ, చంద్రకళ, భవాని, ఉమాదేవి, సుమతిదేవి, దేవేంద్రమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

బ్యాంబో క్లస్టర్‌తో ఆర్థిక తోడ్పాటు



మాట్లాడుతున్న చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ ఆఫ్ జనరల్ స్వరూప

చంద్రుగొండ: ఆదివాసీల ఆర్థిక స్థితిగతులను మార్చేందుకే మారుమూల గ్రామమైన బెండాలపాడులో బ్యాంబో క్లస్టర్ ఏర్పాటు చేసినట్లు జాతీయ సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల డైరెక్టర్ ఆఫ్ జనరల్ గ్లోరి స్వరూప తెలిపారు. మండలంలోని బెండాలపాడు గ్రామశివారులో ప్రకృతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెదురు ఉత్పత్తుల పరిశ్రమను ఆమె బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో వెదురు ఉత్పత్తి అధికంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీల అభివృద్ధి సంస్థ చైర్మన్ నేతాజీ, సూర్యప్రకాష్, ప్రకృతి సంస్థ చైర్మన్ జయశ్రీ, అధికారులు, ప్రజాప్రతినిధులు ఎల్లయ్య, బాణోత్ పార్వతి, పూసం వెంకటేశ్వర్లు, బొర్రా లలిత, బ్యాంబో క్లస్టర్ ప్రెసిడెంట్ ఈసం నాగభూషణంతోపాటు బాలరాజు, రమేష్, బొర్రా సురేష్, దారం గోవిందరెడ్డి, సయ్యద్ సర్దార్, ఫజల్ పాల్గొన్నారు.

రెండు నెలల్లో పూర్తి చేయాలి



మినీ స్టేడియం పనుల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోరం

ఇల్లెందు: రెండు నెలల్లో మినీ స్టేడియం పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య జిల్లా స్పోర్ట్స్ అధికారి పరంధామరెడ్డిని ఆదేశించారు. బుధవారం సీఈఆర్ క్లబ్‌లోని మినీ స్టేడియం పనులను పరిశీలించి మాట్లాడారు. ఏడేళ్లుగా ఎందుకు పనులు పూర్తి చేయడంలేదని ప్రశ్నించారు. మినీ స్టేడియం చుట్టూ ప్రహరీ నిర్మించాలని, వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, మండల రాము, పెద్దినేని హరినాథ్‌బాబు, బోళ్ల సూర్యం, సీహెచ్. శ్రీనివాసరావు ఉన్నారు.

మావోయిస్టుల ఎదురుకాల్పులు



స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో పోలీసులు

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా దంతేష్‌పురం, కోరాజ్ పాడ్ అటవీ ప్రాంతంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య బుధవారం ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. పోలీసులు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. కాల్పులు జరుపుతూ మావోయిస్టులు అటవీప్రాంతంలోకి పారిపోగా, వారి క్యాంప్ నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు మావోయిస్ట్ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని సుకుమా ఎస్పీ కిరణ్ చౌహాన్ తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

అశ్వారావుపేటరూరల్: అతిగా మద్యం తాగి, అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందగా, పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన నల్లే ప్రసాద్ (45) కొంతకాలంగా మద్యానికి బానిసై, అనారోగ్యానికి గురయ్యాడు. బుధవారం కూడా అతిగా మద్యం తాగాడు. కాగా జంగారెడ్డిగూడెం మార్గంలోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా...

19 నుంచి కుల ఆధారిత సామాజిక, ఆర్థిక సర్వే

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 19వ తేదీ నుంచి కుల ఆధారిత సామాజిక, ఆర్థిక స్థితిగతుల సర్వే నిర్వహించాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.గిరిజాశంకర్ బుధవారం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీచేశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఈ నెల 19వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలని సూచించారు. సర్వేని పదిరోజుల్లో.. ఈ నెల 28వ తేదీకి పూర్తిచేయాలని నిర్దేశించారు. సర్వేకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ఈ నెల 11వ తేదీలోగా శిక్షణ పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీలోగా సర్వే సిబ్బందిని, పర్యవేక్షణ సిబ్బందిని మ్యాపింగ్ చేయాలని, 17వ తేదీలోగా పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాలని సూచించారు.

షరతులతో చంద్రబాబుకు ముందస్తు బెయిల్

ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉచిత ఇసుక, మద్యం కేసుల్లో మంజూరు చేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్ భూ కుంభకోణం, ఉచిత ఇసుక, మద్యం విధానాల్లో అక్రమాలపై సీఐడీ నమోదు చేసిన కేసుల్లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అలాగే మద్యం కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ అప్పటి కమిషనర్ శ్రీ నరేష్‌లకు కూడా ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఈ సందర్భంగా హైకోర్టు పలు షరతులు విధించింది. ఇప్పటి నుంచి వారంలోపు దర్యాప్తు అధికారి ముందు లొంగిపోవాలని చంద్రబాబు, రవీంద్ర, శ్రీ నరేష్‌లను హైకోర్టు ఆదేశించింది. రూ. లక్షకు రెండు వ్యక్తిగత పూచీకత్తులు సమర్పించాలంది. ముందస్తు బెయిల్‌పై విడుదలైన తరువాత ఎప్పుడు పిలిస్తే అప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని చంద్రబాబు తదితరులను ఆదేశించింది. అయితే 48 గంటల ముందు నోటీసు ఇవ్వాలని దర్యాప్తు అధికారికి స్పష్టం చేసింది. దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించింది. ఈ కేసుల గురించి తెలిసిన వ్యక్తిని.. ఆ కేసుల వాస్తవాలను కోర్టుకు గానీ, పోలీసులకు గానీ చెప్పకుండా బెదిరించడం గానీ, ప్రలోభపెట్టడం గానీ, వాగ్దానాలు చేయడం గానీ ఎంత మాత్రం చేయడానికి వీల్లేదంది. ఈ కేసులకు సంబంధించి ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేయడానికి వీల్లేదని చంద్రబాబు తదితరులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం తీర్పులు వెలువరించారు.

టీడీపీ కకావికలం

తమ్ముళ్ల హాహాకారాలు.. పలు నియోజకవర్గాల్లో అభ్యర్థుల కరువు

ఎంపీ కేశినేని నాని బాటలోనే టీడీపీకి గుడ్‌బై చెబుతున్న నేతలు

- దబ్బు మూటలే అర్హతగా సమన్వయకర్తల నియామకం
- మరోవైపు టీడీపీ–జనసేన మధ్య పొత్తు కుంపట్లు.. అనేక నియోజకవర్గాల్లో కుదరని సయోధ్య
- ఘోర పరాజయం తప్పదని పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం



టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడి రాజకీయం అంతా నాటి నుంచి నేటి వరకు డబ్బుతోనే ముడిపడి సాగుతోంది. అభ్యర్థులను డబ్బు మూటలతో తూకం వేస్తుండటం ఆ పార్టీ సీనియర్ నేతలను నివ్వెర పరుస్తోంది. ఒక్కచోట కూడా గెలవని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను పక్కన పెట్టుకుని అడుగులు ముందుకు వేస్తుండటం పట్ల అత్యధిక నియోజకవర్గాల్లో నేతల నుంచి విముఖత వ్యక్తమవుతోంది. దీనికి తోడు మాలోకం లోకేష్ తీరు కలవర పెడుతోంది. ఇప్పటికే కొందరు నేతలు ఆ పార్టీని వీడటం.. త్వరలో గుడ్‌బై చెప్పేందుకు పెద్ద సంఖ్యలో నేతలు సిద్ధపడుతుండటం బాబును ఆందోళనకు గురిచేస్తోంది. నష్ట నివారణ కోసం మధ్యవర్తులను రంగంలోకి దింపినా ఫలితం కనిపించక తండ్రీ కొడుకులు తల పట్టుకున్నారు.

సాక్షి, అమరావతి : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలకు సమన్వయకర్తల ఎంపికకు డబ్బు మూటలనే ప్రధాన అర్హతగా నిర్ణయించడం ఆ పార్టీలో సీనియర్ నేతలను కలవరపరుస్తోంది. ఆది నుంచి టీడీపీని నమ్ముకున్న వారిని కాదని.. డబ్బు మూటలను చూపుతున్న వారినే సమన్వయకర్తలుగా నియమిస్తుండటంతో సీనియర్ నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని బుధవారం ఆ పార్టీని వీడారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు. సీఎం వైఎస్ జగన్‌తో కలిసి పని చేస్తానని ప్రకటించారు. ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో రూ.20 కోట్లు డిపాజిట్ చేసిన వారికే టికెట్ ఇస్తానంటూ చంద్రబాబు తెగేసి చెప్పడంతో మాజీ మంత్రి పీతల సుజాత ఆందోళన చెందుతున్నారు. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో తనను కాదని పక్కన పెట్టి.. కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని నియమించాలని చంద్రబాబు ఆలోచిస్తుండటంతో ఆ నియోజకవర్గ సమన్వయకర్త ధర్మవరం సుబ్బారెడ్డి గందరగోళంలో పడ్డారు. డబ్బు మూటలే ప్రాతిపదికగా సమన్వయకర్తలను చంద్రబాబు మార్చేస్తుండటం.. కేశినేని నాని బాటలోనే సీనియర్ నేతలు ఒకరి వెంట ఒకరు పార్టీని వీడుతుండటంతో 'దేశం'కకావికలమవుతోంది. ఎన్నికల షెడ్యూలు వెలువడడానికి ముందే పార్టీ బలహీనంగా మారడంతో తెలుగు తమ్ముళ్లలో హాహాకారాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమాభివృద్ధి పథకాలు, విప్లవాత్మక సంస్కరణలతో సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో రోజురోజుకు మద్దతు పెరుగుతుండటంతో ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసేందుకు అత్యధిక నియోజకవర్గాల్లో అభ్యర్థులు ముందుకు రావడం లేదు. దాంతో ఎన్నికల్లో ఉనికి చాటుకోవడం కోసం జనసేనతో పొత్తుకు చంద్రబాబు పాకులాడారు. కానీ.. క్షేత్ర స్థాయిలో టీడీపీ, జనసేన నేతల మధ్య సఖ్యత కుదరక పోవడంతో పొత్తు కుంపట్లను రాజేస్తోంది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన నేత కందుల దుర్గేష్.. తెనాలిలో జనసేన నేత నాదేండ్ల మనోహర్, టీడీపీ సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ల మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. టీడీపీ బలహీనంగా మారడం.. టీడీపీ–జనసేన పొత్తు కుంపట్లను రాజేస్తుండటంతో 2019 ఎన్నికల కంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ–జనసేన కూటమికి ఘోర పరాజయం తప్పదనే భావన ఆ పార్టీ శ్రేణుల్లోనే వ్యక్తమవుతోంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నేటి నుంచి విధుల్లోకి మున్సిపల్ కార్మికులు

కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు సఫలం

సాక్షి, అమరావతి: పురపాలక సంఘాలు, కార్పొరేషన్ల పరిధిలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు గురువారం నుంచి విధుల్లో చేరేందుకు అంగీకరించారు. బుధవారం సచివాలయంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. సీవరేజీ మరణాలకు సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా రూ.30 లక్షలు పరిహారం చెల్లింపు, సరండర్ లీవ్ బిల్లులు విడుదల, రెగ్యులర్ కార్మికులకు పీఎఫ్ అకౌంట్ చెల్లింపు, పారిశుద్ధ్య కార్మికులు కానివారి కేటగిరీల మార్పు విషయంలో ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలపై సత్వరమే చర్యలు తీసుకుంటామని గతంలోనే మంత్రుల బృందం హామీ ఇచ్చింది. అలాగే గతంలో చనిపోయిన కుటుంబాలకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంపును కూడా అంగీకరించింది. ప్రభుత్వ హామీలకు కార్మిక సంఘాలు ఆమోదం తెలిపాయని, గురువారం సాయంత్రానికి మినిట్స్ ఇస్తామని మంత్రి బొత్స ప్రకటించారు. చర్చలు సానుకూలంగా జరిగాయని, సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. గురువారం నుంచి కార్మికులు విధుల్లోకి వస్తారన్నారు. జీవో వచ్చాక సమ్మెను విరమిస్తామన్నారు.

పనికిరాని వ్యక్తి.. పచ్చి మోసగాడు

చంద్రబాబుపై ఎంపీ కేశినేని నాని ధ్వజం
- తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిసిన కేశినేని
- రాజీనామా స్పీకర్ ఆమోదం పొందగానే వైఎస్సార్ సీపీలో చేరతానని ప్రకటన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ కేశినేని నాని

సాక్షి, అమరావతి: ''చంద్రబాబు పచ్చి మోసగాడు.. ఈ రాష్ట్రానికి పనికిరాని వ్యక్తి అని తెలిసి కూడా విజయవాడపై ప్రేమ, నియోజకవర్గం కోసమే టీడీపీలో ఇంతకాలం ఉన్నా..''అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) వ్యాఖ్యానించారు. టీడీపీలో ఎన్నో అవమానాలను ఓర్చుకున్నానని, ఇక భరించలేక బయటికి వచ్చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 'ముఖ్యమంత్రి జగన్ పేదల పక్షపాతి. ఆయన విధానాలు నాకు నచ్చాయి. సీఎం జగన్ వెనుక నడవాలని నిర్ణయించుకున్నా. పార్టీ కోసం ఆయన ఏం చేయమంటే అది చేస్తా..'అని పేర్కొన్నారు. తాను నైతిక విలువలు పాటించే వ్యక్తినని, టీడీపీకి రాజీనామాతో పాటు ఎంపీ పదవికి రాజీనామాను స్పీకర్ ఫార్మాట్‌లో పంపుతానన్నారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరతానని తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ను కలసిన అనంతరం ఎంపీ కేశినేని నాని మీడియాతో మాట్లాడారు. సీఎంను మర్యాద పూర్వకంగానే కలిశానని చెప్పారు.

నాతో నెల జీతాలు ఇప్పించారు..

పేదలకు అండగా ఉన్న సీఎం జగన్ వెంట నడవాలని నిర్ణయించున్నట్లు ఎంపీ కేశినేని నాని వెల్లడించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడితో ప్రెస్‌మీట్ పెట్టించి తనను దూషించారని, చెప్పు తీసుకొని కొడతానని ఓ క్యారెక్టర్‌లెస్ వ్యక్తి తిట్టినా పార్టీ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనను గొట్టంగాడు అని దారుణంగా అవమానించినా భరించానన్నారు. 'చంద్రబాబు నన్ను ఎన్నో సార్లు అవమానించారు. టీడీపీ గెలిచేది లేదని చాలా మంది నాకు చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పార్టీని నా భుజస్కందాలపై నడిపించా. పార్టీ కోసం నా సొంత వ్యాపారాలను పక్కనపెట్టా. వ్యాపారాల కంటే పార్టీ ముఖ్యమని పని చేశా. టీడీపీ కోసం ఆస్తులు అమ్ముకున్నా. వ్యాపారాలు సైతం వదులుకున్నా. చంద్రబాబు పాదయాత్ర, స్థానిక సంస్థల ఎన్నికలను నా భుజాలపై మోశా. పార్టీ కోసం, ప్రజల కోసం నిజాయితీగా కష్టపడ్డా. కొందరికి నెలవారీ జీతాలు ఇవ్వమని చంద్రబాబు చెబితే డబ్బులు ఖర్చు పెట్టా. తొమ్మిదేళ్లుగా పార్టీలో ఉంటే నేను చేసిన తప్పేమిటో కనీసం చెప్పాలి కదా?'అని ఎంపీ కేశినేని పేర్కొన్నారు.

బొండా భార్యను నిలబెడితే ప్రమాదం..

'విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బొండా ఉమ భార్యను నిలబెడితే చాలా ప్రమాదం. నీ కుమార్తెను పోటీ చేయించు అని చంద్రబాబు నాతో అన్నారు. విజయవాడ మేయర్ అభ్యర్థిగా శ్వేతను చంద్రబాబే నిర్ణయించారు. ఆయన మూడు రోజులు అడిగితేనే ముందుకొచ్చాం. ఆ తర్వాత ప్రెస్‌మీట్ పెట్టించి చంద్రబాబు నన్ను తిట్టించారు. సొంత పార్టీ నేతలే అవమానించినా చర్యలు తీసుకోలేదు. నన్ను చాలా రకాలుగా అవమానించారు. టీడీపీలో ఉంటూ ఇంకా ఎన్ని భరించాలి? ఇష్టం లేకపోతే వెళ్లిపోతానని అందరి సమక్షంలోనే చంద్రబాబుతో చెప్పా. నువ్వు ఉండాల్సిందే అని చంద్రబాబు నాతో అన్నారు. టీడీపీ కోసం సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని చాలా మంది హితవు చెప్పినా వినకుండా పార్టీలో కొనసాగా'అని కేశినేని ఆవేదన వ్యక్తం చేశారు.

లోకేష్.. అప్రాల్

'టీడీపీ కోసం నేను అమ్ముకున్న ఆస్తుల విలువ రూ.2 వేల కోట్లు ఉంటుంది. చివరకు నా కుటుంబంలో చిచ్చు పెట్టారు. నా కుటుంబ సభ్యులతో, రౌడీలతో కొట్టించాలని లోకేష్ ఎందుకు ప్రయత్నించారు? లోకేష్ అనే వ్యక్తి అప్రాల్..! చంద్రబాబు కుమారుడిగా మినహాయిస్తే ఆయనకు ఎలాంటి అర్హతా లేదు. అతడికి పార్టీ అన్నీ ఇచ్చినా ఓడిపోయాడు. నేను నా సొంత వనరులతో గెలిచా. అలాంటిది అతడి వద్ద మోకరిల్లాలంటే సాధ్యం కాదు'అని కేశినేని స్పష్టం చేశారు.

సీఎం కార్యక్రమాలకు హాజరు కానివ్వలేదు

'చంద్రబాబు పచ్చి మోసగాడని ప్రపంచానికి తెలుసు. ఇంత దగా చేస్తాడనుకోలేదు. ప్రోటోకాల్ ప్రకారం ఎంపీగా ముఖ్యమంత్రి కార్యక్రమాలకు నేను హాజరు కావాలి. కానీ సీఎం కార్యక్రమాలకు చంద్రబాబు నన్ను హాజరు కానివ్వలేదు. చంద్రబాబు ఏపీకి పనికి రాని వ్యక్తి. టీడీపీకి, ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని ఇప్పటికే ప్రకటించా. నా రాజీనామా ఆమోదం పొందగానే వైఎస్సార్‌సీపీలో చేరుతా'అని ఎంపీ కేశినేని చెప్పారు.

బెజవాడ, గుంటూరు నిజం.. అమరావతి ఓ కల

'నాకు విజయవాడ అంటే ప్రాణం. బెజవాడ కోసం ఏమైనా చేస్తా. అధికారంలో ఉండగా విజయవాడ కోసం చంద్రబాబు రూ.100 కోట్లైనా ఇచ్చాడా? కానీ విజయవాడ కోసం నేను ఎంతో చేశా. షాజహాన్ తాజ్‌మహల్ కడితే నేను అమరావతి కడతానంటూ చంద్రబాబు గొప్పలు చెప్పారు. విజయవాడ, గుంటూరు మాత్రమే నిజం.. అమరావతి ఒక కలే. అది భ్రమరావతి. అక్కడంతా రియల్ ఎస్టేట్. నేను చంద్రబాబును ఎప్పుడూ టికెట్ అడగలేదు. సీఎం జగన్‌ను కూడా అడగను. సీఎం జగన్‌తో ప్రయాణం చేయాలనుకుంటున్నా. ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీ 60 శాతం ఖాళీ అవబోతుందని ఆయన చెప్పారు'అని కేశినేని నాని పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

బైక్‌పై శబరిమల యాత్ర



బైక్‌పై వెళ్తున్న శ్రీనివాసరావు

అశ్వారావుపేట రూరల్: అయ్యప్ప మాల ధారులు ఇద్దరు బైక్‌పై శబరిమల యాత్రకు శ్రీకారం చుట్టారు. అశ్వారావుపేటలోని తూర్పు బజార్‌కు చెందిన పాశం శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం ఇరుముడి ధరించారు. అనంతరం ద్విచక్ర వాహనాలపై బయలుదేరారు. ఈ సందర్భంగా మాలధారులు మాట్లాడుతూ సుమారు పది రోజుల పాటు యాత్ర సాగనుండగా, రానుపోను సుమారు 3వేల కి.మీ. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తామని తెలిపారు. పంబానది ప్రాంతానికి బైక్‌పై చేరుకుని, అక్కడి నుంచి కాలినడకన అయ్యప్ప దర్శనానికి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

హోరాహోరీగా జెన్‌కో క్రీడాపోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి క్రీడామైదానం టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. బుధవారం జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో కేటీపీఎస్ 5, 6వ దశ జట్టు విద్యుత్ సౌధపై 5–0 స్కోర్‌తో విజయం సాధించింది. అలాగే, బీటీపీఎస్‌పై కేటీపీఎస్ 7వ దశ 6–1తో, పులిచింతలపై కేటీపీపీ 6–2, ఆర్‌టీఎస్‌పై బీటీపీఎస్ 2–0, కేటీపీఎస్ 7వ దశపై కేటీపీఎస్ 5, 6వ దశలజట్టు 1–0, ఆర్‌టీఎస్‌పై కేటీపీపీ 5–0 స్కోర్‌తో విజయం సాధించాయి. ఇక బాల్ బ్యాడ్మింటన్‌లో పోటీల్లో జూరాల జట్టుపై కేటీపీఎస్ 7వ దశ 2–0తో, బీటీపీఎస్‌పై కేటీపీపీ 2–0, శ్రీశైలంపై కేటీపీఎస్ 5, 6వ దశలు 2–0, కేటీపీపీపై పోచంపాడు 2–0 స్కోర్‌తో విజయం సాధించాయి. ఈ పోటీలను సీఈ పి.వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్, గేమ్స్ సెక్రటరీ వై.వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

మిర్చి ధర పతనంపై మంత్రి ఆరా

- రైతులకు నష్టం జరగకుండా చూడాలని ఆదేశించిన తుమ్మల
- అత్యవసరంగా భేటీ అయిన అధికారులు
- నేడు, రేపు జిల్లాలో అధికారులు, శాస్త్రవేత్తల పర్యటన



మిర్చి నాణ్యతను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలోని పలు మార్కెట్లలో మిర్చి ధర ఒక్కసారిగా పడిపోవటంపై రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. మార్కెట్లలో మిర్చి అమ్మకాలు, కొనుగోళ్లు, ధరలపై రైతులు, వ్యాపార వర్గాల నుంచి సమాచారం సేకరించిన ఆయన రైతులకు నష్టం జరగకుండా చూడాలని అధికారులను బుధవారం ఆదేశించారు. ఈ క్రమంలో రాష్ట్ర మార్కెటింగ్, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు రంగంలోకి దిగారు. ఈనెలారంభం నుంచి రాష్ట్రంలో మిర్చి విక్రయాలు పెరుగుతుండగా, ధర మాత్రం పతనమవుతోంది. రాష్ట్రంలో మిర్చి కొనుగోళ్లకు పేరున్న వరంగల్, ఖమ్మం మార్కెట్లలో ధర పడిపోతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై 'సాక్షి'లో రైతుల కళ్లలో కారం, మరింత పతనం దిశగా... శీర్షికలతో మంగళ, బుధవారాల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. గత నెల క్వింటా మిర్చికి రూ.24,500 ధర పలకగా ఈ నెలారంభంలో రూ.23,600కు పడిపోయింది. అలాగే, 5వ తేదీన రూ.23వేలు, 8వ తేదీన రూ.21వేలు, వరంగల్ మార్కెట్‌లో రూ.20వేలుగానే నమోదైంది. దీంతో వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆందోళనకు దిగగా.. పలువురు సరుకు అమ్మకుండానే ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే, వ్యాపారులు మాత్రం విదేశీ ఆర్డర్లు లేవని, పంట నాణ్యత లేదంటూ ధర తగ్గిస్తుండడంతో అసలే దిగుబడి లేక ఆవేదన చెందుతున్న రైతులకు మరింత నష్టం జరుగుతోంది. ఈ వ్యవహారం మంత్రి తుమ్మల దృష్టికి వెళ్లడంతో వెంటనే రంగంలోకి దిగాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్‌లో అత్యవసర సమావేశం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు బుధవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సమావేశంలో జాయింట్ డైరెక్టర్లు లక్ష్మణుడు, రవి, డీడీలు శ్రీనివాసులు, రాజు తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం, వరంగల్ వ్యవసాయ మార్కెట్ అధికారులు కూడా పాల్గొనగా వారం రోజులుగా మార్కెట్లలో మిర్చి కొనుగోళ్లు, ధరలపై చర్చించి రైతులు నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేసినట్లు సమాచారం.


జిల్లాకు అధికారుల బృందం

మిర్చి ధరలు, దిగుబడిపై దృష్టి సారించాలన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు, అధికారులు గురు, శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు మిర్చి సాగు చేసిన ప్రాంతాల్లో పర్యటించి చీడపీడల ప్రభావాన్ని పరిశీలిస్తారు. అలాగే, శుక్రవారం అధికారుల బృందం ఖమ్మం మార్కెట్‌ను సందర్శించి మిర్చి నాణ్యత, ధరలపై ఆరా తీయనున్నారు. కాగా, ఖమ్మం మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లను బుధవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా మద్దతు ధర వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు సైతం నాణ్యత కలిగిన పంట తీసుకురావాలని సూచించారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఏంఏ అలీ, ఖమ్మం మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శి బి.బజార్ తదితరులు ఉన్నారు.

రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్

- జిల్లాకొక కేంద్రం ఎంపిక
- ఖమ్మం జిల్లా వీ.వీ.పాలెంలో ఏర్పాట్లు

రఘునాథపాలెం: రైతులు, వ్యవసాయశాఖ అధికారుల మధ్య వారధిలా ఉండేలాగత ప్రభుత్వం ప్రతీ క్లస్టర్ పరిధిలో రైతు వేదిక నిర్మాణం చేపట్టింది. ఇప్పుడు వీటిని మరింత ఉపయోగంలోకి తీసుకరావాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాకొక కేంద్రాన్ని ఎంపిక చేసి వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలోని రైతు వేదికను ఎంపిక చేయగా సంక్రాంతి రోజున వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని ప్రారంభిస్తారు. తద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులలకు పంటల సాగులో మెళకువలపై అవగాహన కల్పించొచ్చని భావిస్తున్నారు. తొలిదశలో జిల్లాకొక రైతువేదికగా మోడల్‌గా తీర్చిదిద్ది.. ఆతర్వాత జిల్లాలోని అన్ని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పిస్తారని చెబుతున్నారు.



వీ.వీపాలెంలోని రైతు వేదిక

వాలీబాల్ విజేతగా ఖమ్మం జట్టు



టోర్నీలో విజేతగా నిలిచిన ఖమ్మం జట్టు

అశ్వారావుపేటరూరల్/ ఖమ్మం వ్యవసాయం: రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల వాలీబాల్ పోటీలు మహబూబ్‌నగర్‌లో జరుగుతుండగా ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో 16 జట్లు పాల్గొనగా బుధవారం ఉత్కంఠగా సాగిన ఫైనల్స్‌లో మహబూబ్‌నగర్ జట్టుతో తలపడిన ఖమ్మం జట్టు 25–21, 25–19 స్కోర్‌తో గెలుపొందింది. మ్యాచ్‌లో కెప్టెన్ గంటా వెంకటేశ్వరరావు(అశ్వారావుపేట లైన్ ఇన్‌స్పెక్టర్), కోచ్ ప్రకాష్, మేనేజర్ బానోత్ ఉపేందర్ పర్యవేక్షణలో జట్టు కప్ కైవసం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా ఉద్యోగుల జట్టు రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలవడం ఇది మూడోసారి కాగా, క్రీడాకారులను అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏడీఈ వెంకటేశ్వర్లు, ఉద్యోగులు అభినందించారు.

సమష్టి కృషితో లక్ష్యసాధన

- 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధనకు కార్యాచరణ
- సింగరేణి సీఎండీ బలరామ్



డైరెక్టర్లతో సమీక్షలో మాట్లాడుతున్న బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరముందని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన ఆయన వివిధ విభాగాల డైరెక్టర్లు, జీఎంలతో సమావేశమయ్యారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు 80రోజుల సమయమే ఉన్నందున ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. రానున్న వేసవిలో థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండేలా రోజుకు 2.24 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని, రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని ఆదేశించారు. ఈ విషయమై అధికారులు ఏరియాల వారీగా ప్రతిరోజు సమీక్షించాలని తెలిపారు. నూతన ప్రాజెక్టుల ప్రారంభంలో ఎదురవుతున్న అవాంతరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పరిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఒడిశాలోని నైనీలో బొగ్గు బ్లాక్ ద్వారా త్వరగా ఉత్పత్తి ప్రారంభించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాగా, సింగరేణిలో అనుభజ్ఞులైన జీఎంలు త్వరలో రిటైర్ కానుండగా.. యువ అధికారులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని.. మంచి ప్రతిపాదనలు చేసే వారిని ప్రోత్సహిస్తామని సీఎండీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎన్వీకే.శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

బలహీనతలను అధిగమిస్తూ పోరాడుతాం



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

సింగరేణి(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో నిరాశ చెందడం లేదని, కమ్యూనిస్టులు ఎన్నికలను వర్గపోరాటంలో భాగంగానే చూస్తాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తెలిపారు. కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడినా, గెలిచిన ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని తెలిపారు. గత ఎన్నికల్లో తక్కువ ఓట్లు రావడానికి కారణాలపై విశ్లేంచుకుని బలహీనతలను అధిగమిస్తామని చెప్పారు. ఎన్నికలు సమయాన మాత్రమే ఆ అంశంపై ఆలోచిస్తూ... మిగతా సమయంలో అంతరాలు లేని సమసమాజ నిర్మాణానికి కృషి చేయడమే తమ లక్ష్యయని తెలిపారు. ఈసమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నాయకులు మచ్చవెంకటేశ్వర్లు, కాసాని అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ బాలుర జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో పీఈటీలు

కల్లూరు: కల్లూరు మినీ స్టేడియంలో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచిన వారితో ఖమ్మం జిల్లా బాలుర కబడ్డీ జిల్లా జట్టును ఎంపిక చేశారు. జట్టుకు ఎంపికైన వారిలో ఎస్.యశ్వంత్‌కుమార్, పి.ప్రవీణ్‌కుమార్, బి.రాజేష్, డి.రాజేష్, బి.అశోక్ కుమార్, వి.కౌశిక్, జి.రాజేష్, ఎస్.శ్రీరామ్, జి.నాగరాజు, బి.నవీన్‌కుమార్, ఎస్.సుశాంత్, ఆర్.అనిల్ కుమార్, బి.శివసాయి, బి.హిమేష్ ఉండగా గజ్వేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొననుంది. ఈ వివరాలను కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిస్టోఫర్ బాబు, పీఈటీలు పి.వీరరాఘవయ్య, కె.రాధాకృష్ణ వెల్లడించారు.